సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 25 । జనవరి । 2024



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 16 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



యునెస్కో గుర్తింపునకు కృషి

లేపాక్షి వీరభద్రస్వామి ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని ఆలయ పాలక మండలి నూతన చైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. 10లో

గరిష్టం/కనిష్టం 34.6°/16.7°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సూర్య ప్రసాద్‌కు ప్రధాని మోదీ అభినందన



ప్రధాని నరేంద్ర మోదీతో సూర్యప్రసాద్

పరిగి: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్న ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లి విద్యార్థి రాగే సూర్య ప్రసాద్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాత్రి ఢిల్లీలో అభినందించారు. ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లిలో 5వ తరగతి చదువుతున్న రాగే సూర్య ప్రసాద్, గతేడాది కిలిమంజారోతో పాటు లద్దాఖ్‌లోని దక్షిణ పుల్లు పర్వతాన్ని అధిరోహించాడు. దీంతో కేంద్ర ప్రభుత్వం స్పోర్ట్స్ విభాగంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఎంపిక చేసింది. ఈనెల 22న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు అందజేశారు. 23వ తేదీ రాత్రి ప్రధాని నరేంద్రమోదీ సూర్యప్రసాద్‌తో పాటు రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఎంపికైన బాలలతో ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తమ పాఠశాల విద్యార్థికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్, ఉపాధ్యాయులు అన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రవాణా, పోలీస్, మెడికల్, మున్సిపల్, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్, నేషనల్ హైవేస్ తదితర శాఖల అధికారులతో రోడ్డు భద్రతా సమావేశాన్ని నిర్వహించారు. ఏదైనా కలెక్టర్ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ విష్ణు, డీటీసీ కరుణ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, హెల్మెట్ ధరించక పోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రమాదాల నివారణలో భాగంగా భద్రతా లోపాలున్న ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. సత్వర చర్యల కోసం కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులపై నిరంతరం అంబులెన్స్, క్రెయిన్ సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. పర్తదడే వరపల్లి, ఎస్‌ఎస్ గేట్, సీకేపల్లి, కోన, అమ్మవారిపల్లి, పెనుకొండ, పాలసముద్రం, కోడూరు తోపు, కొడికొండ చెక్ పోస్ట్ తదితర 10 బ్లాక్ స్పాట్‌లు గుర్తించామన్నారు. ఇక రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చే వారికి 'గుడ్ సమర్థియన్' స్కీమ్ కింద రూ.5 వేల ప్రోత్సాహకం అందిస్తామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, ఎంవీఐలు వరప్రసాద్, శివశంకర్, ఆర్టీసీ జనరల్ మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వల.. చిక్కితే విలవిల

- రామగిరి మండలానికి చెందిన అనిల్‌కుమార్‌కు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగం చేసే వెసులుబాటు ఉందని ఓ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. అగంతకుడు తాను విశాఖపట్నం నుంచి ఫోన్ చేస్తున్నానని, డబ్బులు పంపితే ఆన్‌లైన్ ద్వారా చేసే ఉద్యోగం ఇప్పిస్తామని, గంటకు వేలల్లో ఆదాయం లభిస్తుందని నమ్మబలికాడు. దీంతో అనిల్‌కుమార్ అరగంట తర్వాత రూ.లక్ష ఫోన్ పే చేశాడు. ఆ తర్వాత సదరు ఫోన్ నంబరు స్విచాఫ్ వచ్చింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో తాను మోసపోయానని, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.
- పుట్టపర్తికి చెందిన రమేశ్‌కు శ్రీకాకుళం నుంచి మాట్లాడుతున్నానని ఓ వ్యక్తి కాల్ చేసి.. పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపాడు. రోజుకు రూ.10 వేలకుపైగా ఆదాయం వస్తుందని నమ్మబలికాడు. పెట్టుబడుల రూపంలో వరుసగా నాలుగు రోజుల పాటు రూ.50 వేల చొప్పున తీసుకున్నాడు. మొదట నాలుగు రోజులు రూ.10 వేలు చొప్పున ఇచ్చాడు. కానీ ఆ తర్వాత దుకాణం సర్దేశాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

.. ఇలా జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు విసిరే ఆశల వలకు సామాన్యులు చిక్కుకుపోతున్నారు. ఈజీ మనీ కోసం తమ వద్ద ఉన్న సొమ్ము మొత్తం ముట్టజెపుతున్నారు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక.. తాము మోసపోయామంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



- ఈజీమనీ పేరుతో పెరుగుతున్న మోసాలు
- బ్యాంకు నుంచి రుణం మంజూరైందంటూ వల
- తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించవచ్చని ఎర
- ఉద్యోగాల పేరుతో యువతుల నుంచి భారీ వసూళ్లు
- పండుగల సమయంలో ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో దగా
- బాధితుల నుంచి ఎడాపెడా డబ్బులు లాగుతున్న నేరగాళ్లు

సాక్షి, పుట్టపర్తి

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త అవతారం ఎత్తుతున్నారు. ఆయా పరిస్థితులకు అనుగుణంగా ప్రజలను ఈజీ మనీ ట్రాప్‌లో పడేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. కూర్చున్న చోట నుంచే అమాయకుల బ్యాంకు ఖాతాను కొల్లగొడుతున్నారు. సెల్ టవర్ ఏర్పాటుతో భారీ లాభాలని.. విమాన టికెట్ బుకింగ్ ఏజెన్సీతో ఈజీ సంపాదన అంటూ.. గ్యాస్ ఏజెన్సీలు ఇప్పిస్తామంటూ.. ఉద్యోగాల పేరుతో అమాయకులకు టోకరా వేస్తున్నారు. అతి తక్కువ వడ్డీకే పర్సనల్ లోన్ ఇస్తామంటూ నమ్మబలికి నట్టేట ముంచుతున్నారు. ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడుతూ.. మెల్లమెల్లగా డబ్బులు లాగుతూ తర్వాత స్విచాఫ్ చేస్తున్నారు.

బ్యాంకు లోన్ ఇప్పిస్తామంటూ..

సైబర్ నేరగాళ్లు ఆకొత్త మోసం చేయడంలో ఆరితేరిపోయారు. తక్కువ వడ్డీ రేటుతో తమ బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని ఫోన్ చేస్తారు. ఆ తర్వాత నగదు పంపించాలని సూచిస్తారు. లక్ష్యం పూర్తి కాగానే ఫోన్ స్విచాఫ్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో ప్రతి వారం వెలుగు చూస్తున్నాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'స్పందన'లోనూ ఇలాంటి వాటిపై బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు.

టీమ్ వ్యూవర్ ద్వారా..

బ్యాంకు ఖాతాకు కేవైసీ చేయాలని లేకపోతే ఖాతా బ్లాక్ అవుతుందని సైబర్ నేరగాళ్లు సామాన్యులకు టోకరా వేస్తున్నారు. వారిని మాటల్లో పెట్టి మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీ చెప్పించుకుంటున్నారు. ఆ తర్వాత ఖాతా చూసుకుంటే నగదు డ్రా అయినట్లు చూపుతోంది. అలాగే విద్యుత్ బిల్లు బకాయి ఉన్నారంటూ ఫోన్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు... తామే ఒక లింక్ పంపుతామని దాన్ని క్లిక్ చేసి డబ్బు చెల్లించాలని సూచిస్తున్నారు. లింక్ క్లిక్ చేసిన మరుక్షణం ఫోన్ నేరగాడి ఆధీనంలోకి వెళ్లి ఆ ఖాతాలో ఉన్న నగదు మాయం అవుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో..

ఆన్‌లైన్ సమయంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు పలు ఆఫర్లు ప్రకటిస్తూ ఉంటాయి. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రముఖ కామర్స్ వెబ్‌సైట్ల తరహాలోనే నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి కస్టమర్లకు గాలం వేస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసే ముందు వినియోగదారులు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడం మంచిది.

జిల్లాలో సైబర్ కేసుల వివరాలు..

శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడిన నాటి నుంచి వివిధ పోలీస్ స్టేషన్లలో 245 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. ఇందులో ఎక్కువగా ఉద్యోగం పేరుతో టోకరా, ఆన్‌లైన్ జాబ్స్, అధిక వడ్డీ ఆశ చూపిన కేసులు ఉన్నాయి.

అప్రమత్తతతోనే అడ్డుకట్ట



తొందరగా ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆశతోనే చాలామంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. డబ్బులిస్తే వచ్చే ఉద్యోగాలు ఏవీ లేవు. అయినప్పటికీ జాబ్స్ కోసం ఎవరెవరికో డబ్బులు ఇవ్వకూడదు. ఎవరైనా డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇస్తామని కాల్ చేస్తే వెంటనే పోలీసులను సంప్రదించండి. ప్రజలు అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు. – ఎస్వీ మాధవరెడ్డి, జిల్లా ఎస్పీ

కదిరి వేరుశనగకు జాతీయ గుర్తింపు

- అగ్రివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి



కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలతో అగ్రివర్సిటీ ఉప కులపతి డా.శారద జయలక్ష్మీదేవి

కదిరి: వేరుశనగ నూతన వంగడాల్లో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి జాతీయ స్థాయి గుర్తింపు ఉందని అగ్రివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మీ దేవి అన్నారు. బుధవారం ఆమె పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అధిక దిగుబడినిచ్చే కదిరి-6 (కే-6) లాంటి నూతన రకాలు రైతులకు లాభదాయకంగా ఉంటాయన్నారు. వేరుశనగను ఆశిస్తున్న పురుగులు, తెగుళ్లను నివారించేందుకు ప్రకృతి సిద్ధమైన జీవ నియంత్రణ పద్ధతులపై పరిశోధనలు జరపాలని ఆమె సూచించారు. కదిరి పరిశోధన కేంద్రం దేశానికే తలమానికమన్నారు. కదిరి లేపాక్షి, కే-6 రకాలు దేశవ్యాప్తంగా 60 నుంచి 70 శాతం సాగులో ఉన్నాయన్నారు. అనంతరం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ మాట్లాడుతూ.. కదిరి పరిశోధన స్థానంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని, మరింత మంది శాస్త్రవేత్తలు, సిబ్బంది కావాలని ఆయన వైస్ చాన్సలర్‌ను కోరారు. పరిశోధనల కోసం విత్తనాభివృద్ధి చేసేందుకు మరో 100 ఎకరాల భూమి అవసరమన్నారు. ఇందుకు వైస్ చాన్సలర్ సానుకూలంగా స్పందించారు. పరిశోధన స్థానం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.వెంకటేశ్వర్లు, డా.ప్రసన్న రాజేష్, డా.నీలిమ, డా.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిని సస్యశ్యామలం చేస్తాం

- ఆరో రోజు కొనసాగిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాదయాత్ర
- గాజులపల్లి రిజర్వాయర్‌కు భూమి పూజ, శిలాఫలకం ఆవిష్కరణ
- పాదయాత్రలో బ్రహ్మరథం పట్టిన వివిధ గ్రామాల ప్రజలు



పెడపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వెంట నడుస్తున్న నాయకులు, రైతులు, మహిళలు

పుట్టపర్తి అర్బన్: రైతుల ఆకాంక్షలను నెరవేర్చేలా పుట్టపర్తి నియోజకవర్గంలోని 6 మండలాల్లోని 193 చెరువులను కృష్ణా జలాలను నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే పనులకు శ్రీకారం చుడుతూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర' ఆరో రోజు బుధవారం పుట్టపర్తి రూరల్ మండలంలో కొనసాగింది. ఉదయం పెడపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పాదయాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పెద్ద తండా, కోనాపురం, మార్గపల్లి, సూరగానిపల్లి, కొట్లపల్లి, కొత్తచెరువుమిడి, నిడిమామిడి, దండువారిపల్లి, కర్తివారిపల్లి మీదుగా కొనసాగించారు. ఈ సందర్భంగా గాజుల పల్లి సమీపంలో నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్‌కు ఎమ్మెల్యే దుద్దుకుంట భూమి పూజ చేసి అక్కడే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాదయాత్రలో రైతులు, యువత, పార్టీ శ్రేణులు ఉరకలెత్తే ఉత్సాహంతో పాల్గొన్నారు. గ్రామ గ్రామాన మహిళలు హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పెద్దతండా వద్ద సర్పంచ్ మంగ్లీబాయి, యర్రా భాస్కర్, తిరుపాల నాయక్ క్రెయిన్‌తో భారీ పూలహారాన్ని ఎమ్మెల్యేకు వేశారు.

18 నెలల్లో గాజులపల్లి రిజర్వాయర్ పూర్తి

గాజులపల్లి రిజర్వాయర్‌ను 18 నెలల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శిలాఫలకం ఆవిష్కరణ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. రిజర్వాయర్ పూర్తయితే 0.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని, రిజర్వాయర్ ఒక్కసారి నిండితే నాలుగేళ్ల పంటలు పండుతాయన్నారు.

వారిద్దరూ రాజకీయ బ్రోకర్లు..

టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ఇద్దరూ సన్నాసులు, దద్దమ్మలు, రాజకీయ బ్రోకర్లు, జోకర్లు అంటూ ఎమ్మెల్యే విరుచుకు పడ్డారు. మోసపు హామీలతో గద్దెనెక్కి అనంతరం హామీలను తుంగలో తొక్కడమే వారికి తెలుసన్నారు. తాను ఏ ఒక్క టీడీపీ నాయకునిపైనా అక్రమంగా కేసులు పెట్టలేదని, గ్రామాలు ప్రశాంతంగా ఉండాలన్నదే తన ధ్యేయమన్నారు. పాదయాత్రలో ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, ఎమ్మెల్యే సతీమణి అపర్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, పరిశీలకులు మాధవరెడ్డి, పాలొ సాయి, కోఆప్షన్ మెంబర్ మాబుసాహెబ్, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి, జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జున, మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ఉషారాణి, కన్యాకుమారి, పుష్పలత, సర్పంచులు కల్యాణరెడ్డి, లక్ష్మాం, భారతమ్మ, సతీష్‌రెడ్డి, కవిత, నంజిరెడ్డి, మహేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణానాయక్, ఆదెప్ప పాల్గొన్నారు.



పెడపల్లిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రైతులు

రైతులకు విరివిగా పంట రుణాలివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: రైతులకు మేలు జరిగేలా వ్యవసాయ, పాడికి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఎస్‌ఎల్‌బీసీ, డీసీసీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుతాల రమణారెడ్డి, డీఆర్‌డీఏ కొండయ్య, సీఈఓ రాంప్రసాద్, ఏడీసీసీ అధికారి సురేఖ, ఎల్‌డీఎం రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు పంట రుణాలు, ఆర్థిక సాయం అందించేందుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయంపై జిల్లా కమిటీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదికను పంపడంపై సమావేశంలో సమీక్షించారు.

వేరుశనగకు రూ.36 వేల రుణం..

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరంలో వరి పంటకు ఎకరాకు రూ.47 వేలు, రాగి పంటకు రూ.22 వేలు, వేరుశనగకు రూ.36 వేలు, అరటి మొదటి రకానికి రూ.1,25,000, రెండవ రకానికి రూ.70 వేలు, బొప్పాయి పంటకు రూ.80 వేలు, వంకాయకు రూ. 40 వేలు, ఆలుగడ్డకు రూ.50 వేలు ఉల్లిగడ్డకు రూ.46 వేలు, టమాటకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణాలు మంజూరు చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. నిర్దేశించిన రకాలు రైతులకు మంజూరు చేసి వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, అర్హత పొందిన వారికి బ్యాంకులు రుణాలు అందించాలన్నారు. అలాగే యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అర్హత మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఆర్‌సెటి భవన నిర్మాణానికి ఎకరా స్థలం కేటాయించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ, రానున్న మామిడి సీజన్‌లో మంచి దిగుబడులు వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగుపై పరిశోధించి అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు చంద్రశేఖర్, సుబ్బారావు, పశుసంవర్థక శాఖ అధికారి సుభదాస్, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

పుట్టపర్తి అర్బన్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజలు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పంచాయతీగా చిన్నచిగుల్లరేవు

- జీఓ జారీచేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తాడిమర్రి: మండలంలోని చిన్నచిగుల్లరేవు గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. గ్రామ పంచాయతీగా గుర్తిస్తూ జీఓ జారీ చేసింది. ఈ మేరకు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన గ్రామాలకూ పాత పేర్లే..

చిన్నచిగుల్లరేవు, మర్రిమాకులపల్లి గ్రామాలు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ముంపునకు గురయ్యాయి. దీంతో ప్రభుత్వం ఆ గ్రామాల్లోని వారికి పరిహారం అందించి, పునరావాసం కింద గ్రామాలను మరోచోట నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించింది. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలు ఇళ్లను నిర్మించుకోవడంతో 2022 ఫిబ్రవరి 26న ఆయా గ్రామాలకు పేర్లు పెట్టుకుని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో మండల అధికారులు రెండు గ్రామాల్లోనూ సభలు నిర్వహించి ఆయా గ్రామాలకు పేర్లు ప్రతిపాదించాలని కోరగా, అందరూ చిన్నచిగుల్లరేవు, మర్రిమాకులపల్లికి అవే పేర్లు పెట్టాలని తీర్మానించారు. దీంతో అధికారులు 2023 జూలై 13న చిన్నచిగుల్లరేవు గ్రామానికి పంచాయతీ హోదా ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అలాగే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి రాష్ట్ర సచివాలయానికి వెళ్లి చిన్నచిగుల్లరేవుకు పంచాయతీ హోదా ఇవ్వాలని అధికారులను పలుమార్లు కోరారు. ఈ నేపథ్యంలోనే మర్రిమాకులపల్లి, చిన్నచిగుల్లరేవులను గ్రామ కంఠంగా గుర్తించడంతో పాటు చిన్నచిగుల్లరేవు గ్రామానికి పంచాయతీ హోదా ఇస్తూ ఈనెల 23న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే గ్రామంలో ఓటరు నమోదు, ఓటరు గుర్తింపు కార్యక్రమాలు నిర్వహించి సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.



చిన్నచిగుల్లరేవు ఏరియల్ వ్యూ

ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతోనే



ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతోనే చిన్నచిగుల్లరేవు గ్రామానికి పంచాయతీ హోదా దక్కింది. మర్రిమాకులపల్లి, చిన్నచిగుల్లరేవు గ్రామాలకు ముంపు పరిహారం మంజూరు నుంచి గ్రామాల పేర్లు, గ్రామ పంచాయతీగా గుర్తింపు వచ్చే వరకూ ఎమ్మెల్యే కేతిరెడ్డి కృషి చేశారు. – మేడిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మర్రిమాకులపల్లి, తాడిమర్రి

రెండు గ్రామాలకు న్యాయం



సీబీఆర్ ముంపు గ్రామాలు చిన్నచిగుల్లరేవు, మర్రిమాకులపల్లి గ్రామాల వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎంతో మేలు చేశారు. పరిహారం దగ్గర నుంచి అండగా నిలిచారు. ఇప్పుడు చిన్నచిగుల్లరేవుకు పంచాయతీ హోదా కల్పించారు. – చిగుళ్లరేవు శ్రీనివాసరెడ్డి

క్లుప్తంగా

విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించండి



ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌ఐలు

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల మన్నన పొందాలని ఎస్‌ఐ శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎస్‌ఐలకు ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. 1990 బ్యాచ్‌కు చెందిన 17 మంది ఏఎస్‌ఐలు 45 రోజుల శిక్షణ పూర్తి చేసుకుని బుధవారం ఎస్‌ఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అడిషనల్ ఎస్పీ విష్ణునూ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసుఅధికారులు సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, సూర్యకుమార్, హరినాథ్, ఆనంద్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర పోలీసుల అధికారుల సంఘం కో–ఆప్షన్ సభ్యుడిగా నూతనంగా ఎంపికైన సూర్యకుమార్... అసోసియేషన్ సభ్యులతో కలసి ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీఓలకు స్థానచలనం?

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిధిలోని 30 నుంచి 40 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేయనున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బదిలీలు చేసేందుకు జిల్లా యంత్రాంగం జాబితా సిద్ధం చేసింది. ఈ జాబితాను జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి అధికారులకు జెడ్పీ అధికారులు పంపారు. ఎన్నికల సంఘం ఆమోదం పొందిన తర్వాత అధికారికంగా ఉత్తర్వులు వెలువడించనున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రక్రియ కొలిక్కి రానున్నట్లు జెడ్పీ అధికారులు పేర్కొన్నారు.

ఎస్కేయూ క్యాంపస్‌లో కొత్త కోర్సులు

- బీటెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్సెస్ బ్రాంచ్‌లు
- ఒక్కో కోర్సుకు 60 సీట్ల చొప్పన కేటాయింపు
- ఎంటెక్‌లోనూ కొత్తగా మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులు
- అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం



అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: సాంకేతిక విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. ఇంజినీరింగ్ కోర్సుల్లో సమూల మార్పులు వస్తున్నాయి. ఇందులో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో సరికొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నారు. ఇప్పటిదాకా మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు ఉన్నాయి. వీటికి తోడు 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ అండ్ ఎంఎల్), డేటా సైన్సెస్ కోర్సులు ప్రవేశపెట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏఐసీటీఈ నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. నూతన కోర్సుల అమలుపై బుధవారం అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి ఇందులో నిర్ణయం తీసుకున్నారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులైన ఎస్కేయూ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్లు సి.శోభాబిందు, పి.సుజాత, కృష్ణా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్, ప్రొఫెసర్ బి.నాగభూషణరాజు పాల్గొన్నారు. బీటెక్ కంప్యూటర్ సైన్సెస్‌లో రెండు కొత్త కోర్సులు అమలు చేయాలని నిర్ణయించారు. కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఒక బ్రాంచ్‌కే పరిమితం చేయకుండా మూడు బ్రాంచ్‌లు అమలు చేయాలని పేర్కొన్నారు. తాజాగా ప్రవేశపెట్టే కోర్సుల్లో 60 సీట్లు భర్తీ చేసుకోవచ్చునని సిఫార్సు చేశారు. అదే విధంగా సీఎస్ఈ, ఈసీఈ కోర్సుల్లో ఇప్పటికే ఉన్న 60 సీట్లను 120 సీట్లకు పెంపుదల చేసుకోవచ్చునని వీసీ పేర్కొన్నారు.

ఎంటెక్‌లోనూ రెండు కోర్సులు..

ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్‌లో రెండు కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులను 2024–25 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. ఈ కోర్సుల్లో బోధించడానికి అధ్యాపకులను కాంట్రాక్టు బేసిక్ విధానంలో తీసుకోవాలని నిర్ణయించారు. ఫాదర్ విన్సెంట్ భవనం రెండో అంతస్తులో ఎంటెక్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది.

అడ్మిషన్లకు ఫుల్ డిమాండ్..

ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదవాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకు ఉంది. ఈ క్రమంలో అదనంగా బీటెక్‌లో బ్రాంచ్‌లు ఏర్పడితే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యార్థులకు గొప్ప సదవకాశం లభిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది. ఈఏపీసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు మొదటి ఆప్షన్ ఈ కళాశాలకే ఇస్తుండడంతో వారికే సీట్లు లభిస్తున్నాయి. ఇక్కడ చదువుకున్న వారిలో ఏటా 120 మందికి పేరెన్నికగల బహుళజాతి సంస్థల్లో కొలువులు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా దక్కుతున్నాయి.

క్యాంపస్ కళాశాల బలోపేతానికి చర్యలు..

క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల బలోపేతం దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీటెక్‌లో రెండు కోర్సులు, ఎంటెక్‌లో రెండు కొత్త కోర్సులు అమలు చేయనున్నాం. మార్కెట్ డిమాండ్ దృష్ట్యా విద్యార్థులకు కోర్సులు పూర్తికాగానే కొలువులు దక్కే కోర్సులను రూపకల్పన చేయాలని భావించాం. ఈ మేరకు అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం.

– ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, వీసీ, ఎస్కేయూ.

యునెస్కో గుర్తింపునకు కృషి

- లేపాక్షి ఆలయ పాలక మండలి నూతన ఛైర్మన్ కరణం రమానందన్



ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమానందన్

లేపాక్షి: ప్రపంచ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని ఆలయ పాలక మండలి నూతన ఛైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. ఆలయ ఛైర్మన్‌గా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు నరసింహరాజు, నరసింహమూర్తి సమక్షంలో ఛైర్మన్‌గా రమానందన్, సభ్యులుగా హెచ్.నరసింహమూర్తి, ఎం.మంజుల, బి.శంకరప్ప, కె.శాంతమ్మ, జి.సాయిలీల, బి.నాగరాజు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చోళసముద్రం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమానందన్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం నాయకుడు గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, బిసలమానేపల్లి సర్పంచ్ నాగేంద్రబాబు, సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బషీర్, నాయకులు నిస్సార్, సిరాజ్, బోర్ల అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



బత్తలపల్లికి చేరుకున్న స్పెయిన్‌కు చెందిన మారథాన్ రన్నర్లు



సమావేశంలో మాట్లాడుతున్న అన్నే ఫెర్రర్

- ఆర్డీటీ అసోసియేట్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్

బత్తలపల్లి: అభాగ్యులకు సాయపడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకున్నపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్డీటీ అసోసియేట్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ అన్నారు. అల్ట్రా మారథాన్ ముగింపు సమావేశం బుధవారం బత్తలపల్లిలోని ఆర్డీటీలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ ఛైర్మన్ తిప్పేస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అన్నేఫెర్రర్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారిత డైరెక్టర్ విశాల ఫెర్రర్, అనంతపురం అల్ట్రామారథాన్ ప్రమోటర్ జువాన్ మాన్యుయెల్ వైరా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్డీటీని స్థాపించి 50 సంవత్సరాలకు పైగా అయిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే సంస్థ లక్ష్యమన్నారు. అల్ట్రా మారథాన్ పరుగును జిల్లాలో చేపట్టి అభాగ్యులకు అండగా నిలిచిన మాన్‌వెల్‌ను అభినందించారు. మారథాన్‌లో పాల్గొన్న 67 మంది స్పెయిన్, అర్జెంటీనా దేశస్తులతో పాటు 65 మంది భారతదేశానికి చెందిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. జువాన్ మాన్యుయెల్ వైరా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన నిధితో ఆర్డీటీ చేపట్టిన కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం మాన్‌వెల్, అన్నేఫెర్రర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్పాన్సర్ షీబా, ఆర్డీటీ డైరెక్టర్లు నిర్మల్, సాగర్‌మూర్తి, నాగప్ప, సాయికృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, శివప్ప, సాయి, రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, ఆర్డీటీ ఆస్పత్రి సిబ్బంది, స్పానిష్, అర్జెంటీనా బృందం సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: పోలింగ్ బూత్‌ల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటరు జాబిత ఇప్పటికే విడుదల చేసినట్లు తెలిపారు. హిందూపురం రూరల్ మండలంలో 21,255 మంది పురుషులు, 20,881 మంది మహిళలు, ఇతరులు ఇద్దరిని కలిపి మొత్తం 42,138 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అలాగే పట్టణ పరిధిలో 63,716 మంది పురుషులు, 63,112 మహిళలు, ఇతరులు 13 మందిని కలుపుకుని మొత్తం 1,26,841 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. అలాగే లేపాక్షి మండలంలో 18,026 పురుషులు, 17,610 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్‌ను కలిపి మొత్తం 35,637 మంది, చిలమత్తూరు మండలంలో 20,977 మంది పురుషులు, 20,868 మంది మహిళలు, ఇద్దరు ఇతరులను కలుపుకుని మొత్తం 41,847 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,46,463 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. 18 సంవత్సరాలు నిండి ఇప్పటి వరకూ ఓటరుగా నమోదు చేసుకోని వారు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాలేవైనా ఉంటే సరైన ఆధారాలు ఇస్తే పరిశీలించి వాటిని జాబితా నుంచి తొలగిస్తామన్నారు. లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుని చేర్పులు, తొలగింపులు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంజీఎం పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు తగిన వసతులపై పలు సూచనలు చేశారు. రహమత్‌పురలోని పోలిగ్ బూత్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహసీల్దార్లు స్వర్ణలత, బాబు, నాగరాజు, ఎంపీడీఓ నరేంద్ర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

జనవాక్కు

ఆసరాతో కొండంత అండ



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇప్పటి వరకూ నాకు మూడు విడతలుగా ఆసరా మొత్తం జమ అయింది. నాల్గో విడత సొమ్ము మంగళవారం విడుదలైంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరికీ ఇదొక వరం. 2019 ఎన్నికల సమయానికి మా సంఘానికి రూ.5 లక్షల రుణం ఉండగా... ఈ రోజుతో అది కాస్త తీరిపోయింది. సంఘంలో మళ్లీ రుణం తీసుకునే అవకాశం కల్పించారు. మాకు అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– ప్రభావతి, లేపాక్షి

చేసిన మేలును మరువలేను



నా భర్త అనారోగ్యంతో చనిపోయారు. బతుకు తెరువు కోసం ఉన్న ఇద్దరు కొడుకులూ బెంగళూరుకు వెళ్లారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన చేయూత పథకంతో ఏటా రూ.18,750 చొప్పున మూడుసార్లు లబ్ధి పొందాను. ఓబీసీ పథకం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. ఇంటి వద్దకే వచ్చి రూ.3వేలు పింఛన్ అందజేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును మరువలేను. ఆయనకే మా మద్దతు.

– వాసవాంబ, ఫణారం, గుడిబండ మండలం

రుణం మాఫీ అయ్యింది



సీఎం వైఎస్ జగనన్నతో మహిళా స్వయం సహాయక సంఘాలు బలపడ్డాయి. వైఎస్సార్ ఆసరా పథకంతో మా రుణాలు మాఫీ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి ఇంతగా మహిళలకు మేలు చేసింది లేదు. ఆసరా పథకం కింద ఇప్పటి వరకూ నాకు రూ.36 వేలు లబ్ధి చేకూరింది. ప్రభుత్వ పథకాలన్నీ మహిళలకే దక్కేలా చేశారు. దీంతో కుటుంబాలు ఎంతో బాగుపడ్డాయి. గతంలో మా రుణాలన్నీ మాఫీ చేస్తానని ఓట్లు వేయించుకున్న చంద్రబాబు.. అధికారం చేపట్టిన తర్వాత మమ్మల్ని నిండా ముంచాడు. చంద్రబాబు మాటలు నమ్మి ఓటు వేసినందుకు మా మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్‌ల మెట్లు కూడా ఎక్కలేకపోయారు. మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నే కావాలని కోరుకుంటున్నాం.

– షాకీరాబీ, తురుకువాండ్లపల్లి, మడకశిర మండలం

ఇక సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్!

పుట్టపర్తి: రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ/వార్డు సచివాలయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు సచివాలయాల అడ్మిన్‌లకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్థిరాస్తి క్రయ, విక్రయదారులు ఇక నుంచి తమ గ్రామాల్లోని సచివాలయాల్లోనే సులువుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కాకపోతే ఇందుకు సంబంధించిన పూర్తి నియమ, నిబంధనలు విడుదల కావాల్సి ఉంది.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



టోర్నీని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

ధర్మవరం అర్బన్: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాకారులకు ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ సూచించారు. ఆత్మీయ ట్రస్ట్ సౌజన్యంతో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 14 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. పోటీలను ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు ప్రారంభించి, మాట్లాడారు. ఏటా బాస్కెట్‌బాల్ టోర్నీలు నిర్వహిస్తూ క్రీడాకారుల్లో నైపుణ్యాలు వెలికితీస్తున్న ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, పీడీ నాగేంద్ర, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

డీటీఓగా రామాంజినేయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

అనంతపురం రూరల్: జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి(డీటీఓ)గా రామాంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న అన్నాదొరై ప్రమోషన్‌పై శ్రీకాకుళం వెళ్లగా.. ఆయన స్థానంలో శ్రీసత్యసాయి డ్వామా పీడీ రామాంజనేయులను ప్రభుత్వం ఇటీవల అనంతపురం జిల్లా డీటీఓగా నియమించింది. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వేడినీటి బకెట్లో పడి చిన్నారికి గాయాలు

రొళ్ల: ప్రమాదవశాత్తు వేడి నీటి బకెట్‌లో పడి ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. వివరాలు... రొళ్ల మండలం కొడగార్లగుట్ట ఎస్సీ కాలనీలో నివాసముంటున్న రంజిత, రంగనాథ్ దంపతుల నాలుగేళ్ల వయసున్న కుమార్తె జాను బుధవారం ఉదయం ఆడుకుంటూ స్నానపు గదిలోకి చేరుకుంది. అప్పటికే అక్కడున్న వేడి నీళ్ల ఉన్న బకెట్‌లో అదుపుతప్పి పడింది. చిన్నారి గట్టిగా కేకలు పెట్టడంతో తల్లి అక్కడకు చేరుకుని బకెట్‌లో నుంచి జానుని వెలికి తీసింది. అప్పటికే శరీరం కాలి, బొబ్బలు తేలాయి. కుటుంబసభ్యుల సాయంతో ఓ ప్రైవేట్ వాహనంలో రొళ్లలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు.

వ్యక్తి బలవన్మరణం



కిరణ్‌కుమార్ మృతదేహం

తాడిపత్రి: మానసిక ఒత్తిళ్లు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.... తాడిపత్రిలోని జయనగర్ కాలనీకి చెందిన ఆంజనేయులు కుమారుడు పుట్ట కిరణ్‌కుమార్ (33) కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనైన ఆయన... జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం తాడిపత్రి మండలం చల్లవారిపల్లి సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు ఇంజన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత



సీఐ కార్యాలయం వద్ద గుమికూడిన గిరిజనులు

పెనుకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద కొండంపల్లి తండాకు చెందిన గిరిజనులు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తండాకు చెందిన గిరిజన యువతి అనూష (మేజర్) అదే గ్రామానికి చెందిన హనుమంతరెడ్డితో నాలుగు రోజుల క్రితం వెళ్లిపోయింది. పలు ప్రాంతాల్లో కుటుంబసభ్యులు వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే నాలుగు రోజులు గడిచినా ప్రేమికుల ఆచూకీని పోలీసులు గుర్తించకపోవడంతో బుధవారం ఉదయం గిరిజనులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ప్రేమికులు పెళ్లి చేసుకున్నారని పోలీసులు తెలిపినా వారు వినలేదు. స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న సీఐ రాజారమేష్ అక్కడకు చేరుకుని ఆందోళన కారులకు నచ్చజెప్పి తన కార్యాలయానికి పిలుచుకెళ్లి పంచాయితీ నిర్వహించారు. గిరిజన సంఘం నాయకులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు స్టేషన్‌కు వచ్చి అనూషాకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. అయితే ఆమె వినలేదు. దీంతో గ్రామస్తులు, కుల పెద్దలు, కుటుంబసభ్యులు వెనుదిరిగారు.

మిస్సింగ్ కేసు ఛేదింపు



అదృశ్యమైన యువతిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచిన పోలీసులు

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లికి గ్రామానికి చెందిన అనుషాబాయి మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. అనుషాబాయి బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి బుధవారం పెనుకొండ తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే స్థానిక తహసీల్దార్ సురేష్ ఎదుట హాజరుపర్చారు.

మహిళపై దున్నపోతు దాడి

- 3 నెలల్లో 60 మందికిపైగా క్షతగాత్రులు

కణేకల్లు: మండలంలోని సొల్లాపురంలో ఓ దున్నపోతు రెచ్చిపోయింది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ... తనను కొట్టిన వారిని గుర్తుపెట్టుకుని కుమ్మేస్తోంది. ఈ క్రమంలో అల్లీపీరాస్వామి భజన మందిరం వద్ద నివసిస్తున్న రసూలమ్మ బుధవారం ఉదయం ఇంటి బయట అరుగుపై కూర్చొని ఉండగా దున్నపోతు దాడి చేసింది. కొమ్ములతో ఎత్తి పారేసింది. ఘటనతో ఆమె కుడి కాలు పాదం నుంచి మోకాలి వరకూ చీరుకుపోయింది. దాడిని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై దున్నపోతును తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన రసూలమ్మను అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

కసితో దాడి చేస్తున్న దున్న..

ఆరు నెలల క్రితం సొల్లాపురానికి చేరుకున్న దున్నపోతును గమనించిన స్థానికులు తొలుత అమ్మోరి పోతు అనుకున్నారు. ఈ క్రమంలో దానిని ఎవరూ ఏమి అనకుండా మిన్నకుండి పోయారు. గ్రామంలోనే సంచరిస్తూ దొరికిన ఆహార పదార్థాలను తింటూ వస్తున్న దున్నపోతు... మూడు నెలలుగా తన ధోరణిని మార్చుకుంది. ఇళ్ల ఆవరణలోకి ప్రవేశించి ఎండకు బెట్టిన గింజలను తినడం మొదలు పెట్టడంతో గమనించిన స్థానికులు దున్నపోతును అదలించేవారు. అయినా దున్నపోతు మొత్తం గింజలను తినేంత వరకూ అక్కడి నుంచి కదలకుండా ఉండడంతో కర్రతో కొట్టి తరిమేసేవారు. దీంతో తనపై దాడి చేసిన వారు వీధుల్లో కనిపిస్తే దున్నపోతు రెచ్చిపోయి కుమ్మేస్తూ వచ్చింది. అప్పటి నుంచి దున్నపోతు వీధుల్లో కనిపిస్తే ప్రజలు భయపడి ఇళ్లలోకి చేరుకోసాగారు. మూడు నెలల్లో దాదాపు 60 మంది గ్రామస్తులు దున్నపోతు దాడిలో గాయపడ్డారు. అయితే తొలిసారిగా బుధవారం ఓ మహిళపై దున్నపోతు దాడి చేయడంతో గ్రామస్తుల్లో భయాందోళనలు చోటు చేసుకున్నాయి. అధికారులు స్పందించి దున్నపోతును బంధించి, అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

డీఆర్ఎం సుడిగాలి పర్యటన



కదిరి రైల్వేస్టేషన్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) వినీత్‌సింగ్ బుధవారం డివిజన్ పరిధిలో సుడిగాలి పర్యటన గావించారు. ఆయనతో పాటు సీనియర్ డీసీఎం మనోజ్, డీఈఎన్ గంగరాజు, డీఈఎన్ (వెస్ట్) ఎస్.మణికంఠ, ఆయా సెక్షన్ల ఏడీఈఎన్‌లు ఉన్నారు. ప్రత్యేక రైలులో అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లిరోడ్డు, రేణిగుంట రైల్వేస్టేషన్లను సందర్శించారు. ఆయా స్టేషన్లలో అమృత్ రైల్వేస్టేషన్ స్కీమ్ కింద చేపట్టిన ఆధునీకరణ పనులు పరిశీలించారు. కొత్త లైన్లు, హైలెవల్ ప్లాట్‌ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పార్కింగ్ స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. కదిరి రైల్వేస్టేషన్ ప్రవేశం వద్ద ఐరన్ పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టు దెబ్బ తిన్న విషయం గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు.